


జరిగిన కథ

[భారతస్వాతంత్ర్యదినంనాడు విక్రంసింగ్, కాప్టెన్ అభయంకర్, షేక్ మహమ్మదాలీ, శోభారాణి అనేవారు ప్రైవేటు విమానంలో కరాచీనుండి న్యూఢిల్లీకి బయలుదేరుతారు. కాని ఈ విమానం ఢిల్లీ చేరటానికి బదులు హిమాలయ పర్వతశ్రేణులు దాటి టిబెట్ ప్రాంతంలో, నిర్జనప్రదేశంలో నేలకు దిగుతుంది. పైలట్ చనిపోతాడు. అక్కడికి సమీపంలో ఉన్న షాంగ్రిలా అనే ఆరామంనుంచి చాంగ్ అనే బౌద్ధసన్యాసి వచ్చి విమానంలోనివారిని తనవెంట తీసుకొనిపోయి తమ ఆరామంలో ఆతిథ్యం ఇస్తాడు. ఈ ప్రపంచంలో వచ్చిపడిన నలుగురికీ తిరిగి తమప్రపంచానికి వెళ్లే అవకాశం కనపడదు.]

మూడవ అధ్యాయం

మర్నాడు నిద్రలేచేసరికి విక్రం మనసు చాలా నిర్మలంగా ఉంది. చోటుగానిచోటన్న భావం అతనికేమాత్రమూ కలగలేదు. మిగిలినవారుకూడా ఉత్సాహంగానే ఉన్నారు. షేక్ మహమ్మదాలీ ఏర్పాట్లన్నిటినీ ప్రశంసించాడు. శోభారాణికూడా తన గదిలో అన్నిసౌకర్యాలూ తానూహించిన దానికన్న బాగానే ఉన్నాయన్నది. అభయంకర్ కూడా నిన్నటికన్న చాలా మెరుగుగానే ఉన్నాడు.

"ఎవరన్నా సమర్థుడు పూనుకుంటేతప్ప మనం ఇవాళ బయలుదేరే ఆశ అటేకనబడదు. కాకపోయినా ఈ సన్యాసులకు చురుకుగా పనిచెయ్యటం చేతకాదు. వీళ్ళకి కాలం విలవ ఏంతెలుసు?" అని అతను గొణిగాడు.

అందరూ చపాతీలు ఫలహారంచేసి టీ తాగారు. భోజనం చాలా రుచికరంగా ఉంది. వారి భోజనం అయిపోయే సమయానికి చాంగ్ వచ్చి కుశలప్రశ్నలుచేశాడు.

అందరికన్న ముందుగా అభయంకర్ ప్రయాణం సంగతి ఎత్తి, "మా ప్రయాణం విషయం ఉపేక్షించి లాభంలేదు. మీకభ్యంతరంలేకపోతే నేనే ఉదయమే పోర్టర్లను మాట్లాడుకుంటాను," అన్నాడు.

చాంగ్ తల పంకించి, "ఏమీ లాభంలేదు. మావాళ్ళెవరూ మీవెంట అంతదూరం వెళ్ళరు," అన్నాడు.

విక్రం కల్పించుకుని, "చూడండి. మేము తిరిగిపోయే ప్రయత్నంలేకుండా ఇక్కడ ఎంతకాలమని ఉంటాం? మాకై మేము నడిచి ఇళ్ళకు వెళ్ళిపోలేంగదా? కనక మీరు మాకేవిధంగా సహాయపడేదీ నిశ్చనమలక తెగేసి చెప్పండి," అన్నాడు.

చాంగ్ నవ్వాడు. "మాకు బయటి ప్రపంచంతో బొత్తిగా సంబంధాలు లేకపోలేదు. బయటినుంచి మేము అప్పుడప్పుడూ మాకు కావలిసినవి, ఏవిధంగానైనా కాని వ్వండి, తెప్పించుకుంటూ ఉంటాం, కొద్దికాలంలో సార్థవాహులు రాబోతున్నారు. వచ్చినవారు తిరిగి వెళ్ళిపోతారు. వారితో ఏదైనా ఏర్పాటుచేసుకుని మీరు వారివెంట వెళ్ళిపోవటం యుక్తమని నాకు తోస్తోంది."

"వాళ్ళెప్పుడొస్తారు?" అన్నాడు అభయంకర్.

"ఫలానా తేదీకి వస్తారని చెప్పటానికిలేదు. ఇది రైళ్లూ రహదారులూ ఉండే ప్రాంతంకాదు; ప్రయాణపు ఇబ్బందులు అసంఖ్యాకాలు."

విక్రం మళ్ళీ అడ్డొచ్చాడు. "మీకు సామాన్లు తెచ్చేవారిని పోర్టర్లుగా మేము ఉపయోగించుకోవచ్చునన్నారు, బాగానేఉంది. కాని మరికొన్ని వివరాలుకావాలి, కాని మా మిత్రుడు అడిగినట్లు, వీళ్ళు ఎప్పుడొస్తారో, మమ్మల్ని ఎక్కడికి చేరుస్తారో మాకు తెలియాలి," అన్నాడు.

"అది వాళ్ళనడిగి తెలుసుకోవలసిందే," అన్నాడు చాంగ్.

"ఇండియాకు తీసుకుపోతారా?"

"నేను చెప్పలేను."

"పోనీ రెండోవిషయం చెప్పండి. వాళ్లు ఎంత కాలంలో వస్తారు? తేదీ అక్కర్లేదు. వచ్చేవారమా? వచ్చే సంవత్సరమా?"

"ఒక నెలలో రావచ్చు. బహుశా రెండు నెలలు దాటదు."

"రెండు నెలలే!" అన్నాడు అభయంకర్. "విక్రం, మనమిక్కడ రెండు వారాలుకూడా గడపలేం."

చాంగ్ లేచాడు.

"ఇంతకన్న నే చేయగలిగింది లేనందుకు మన్నించాలి. ఇక్కడ మీరెంతకాలంఉన్నా మీకేలోటూ మాత్రమూ జరగదు."

అభయంకర్ నోటికట్లు తెగిపోయాయి. "మీకా బాధ ఇవ్వం. చూస్తూఉండండి. మాకు కావలసిన పోర్టర్లను మేం సంపాదించుకుంటాం చూడండి. మీ వినయాలతో మాకు పనిలేదు——"

అతనిమాట పూర్తికాకపూర్వమే చాంగ్ నిష్క్రమించాడు.

ప్రవాసులు నలుగురూ మధ్యాన్నందాకా తమ పరిస్థితిని గురించే మాట్లాడుతూ కూచున్నారు.

"నాకంత బాధలేదు," అన్నాడు విక్రం. "నాకెవరూ లేరు. రెండు నెలలు అపరిచిత ప్రదేశాలలో గడపటం నాకేమంత కొత్త అనుభవం కాదు. ఇక నేను చేస్తున్న పని అంటే అది నేనే చెయ్యాలని ఏమీలేదు, మరెవరైనా ఆ పని చెయ్యవచ్చు."

షేక్‌సాయిబుకూడా ఆటే విచారిస్తున్నట్టు కనపడలేదు. "నన్నుగురించికూడా ఎవరూ విచారించరు. నేను నావాళ్ళకెన్నడూ ఉత్తరమైనా రాయను."

"కాని మనం తప్పిపోయినట్టు పత్రికల్లో పడుతుంది. సన్నిహితులెవరన్నా ఉంటే మనమీద ఆశలు వదులుకుని దుఃఖిస్తారు. ఆసంగతి మరచిపోరాదు," అన్నాడు విక్రం.

షేక్‌సాయిబు క్షణంపాటు ఆశ్చర్యపడి, "అందువల్ల నాకేమీ నష్టంలేదు," అన్నాడు.

ఎందుకు నష్టంలేదో విక్రంకు అర్థంకాలేదు, కాని అతనా ప్రశ్న వెయ్యలేదు.

శోభారాణికూడా ఇక్కడ రెండుమాసాలపాటు ఉండిపోవటానికి ఎట్టి అభ్యంతరమూ చెప్పలేదు.

పోతే ఒక్క అభయంకరే విక్రంకు మిగిలిన సమస్య. అభయంకర్‌కూడా కొంతవరకు తన పరిస్థితికి మనస్సును సమాధానపరుచుకునేవాడిలాగా, "ఈ దిక్కుమాలిన ప్రదేశంలో నేనేం చెయ్యగలనో పాలుబోవటంలేదు," అన్నాడు.

"ఇక్కడివాళ్ళదగ్గిర చాలా డబ్బుండి ఉండాలి. లేకపోతే ఇవన్నీ వీళ్ళకెక్కడినుంచి వచ్చినట్టు? కాని ఎగుమతి వ్యాపారం లేకుండా వీళ్ళు పుష్కలంగా డబ్బు ఎట్లా సంపాదిస్తారు? లోయలో గనులేమయినా ఉన్నాయేమో," అన్నాడు షేక్‌మహమ్మదాలీ.

"నన్నడిగితే ఇదంతా ఏదో బ్రహ్మరహస్యం. వీళ్ళదగ్గిర ఏవో నిధులు ఉండివుంటాయి. అయినా నాకెందుకు? ఈ చోటు వదిలిపోయిన మరుక్షణం దీన్నిగురించి ఆలోచించను. వీళ్ళెట్లాచస్తే నాకేం?" అన్నాడు అభయంకర్.

వీళ్ళీవిధంగా మాట్లాడుకుంటూ ఉండగానే దివ్యమైన భోజనం వచ్చింది. కాస్త వెనకగా చాంగ్ వచ్చాడు. అతను వీళ్ళ స్నేహితుడులాగే, తనకూ వీళ్ళకూ అభిప్రాయభేదాలు లేనట్టే, మాట్లాడాడు. వీళ్ళు అభ్యంతరం చెప్పలేదు.

వినోదావారి "దేవదాసు" శతదినోత్సవ సందర్భంలో విశాఖపట్న
కలెక్టరు సతీమణి డి. ఎల్. గారికి రజితపాత్ర ఇచ్చింది



"మీరు మా ఆరామాలు చూడదలిచినట్లయితే నేను స్వయంగా మీవెంట వచ్చి చూపించగలను," అన్నాడు చాంగ్.

అందరూ సమ్మతించారు. షాంగ్రిలా పర్యటన ప్రారంభమయింది.

విక్రం లోగడ బౌద్ధమఠాలు చూడకపోలేదు. కాని దీనికీ వాటికీ ఎక్కడా పోలికలేదు. కేవలం ప్రమాణంలోనే ఇది అపారమైనది. ఒక దివాణం తరువాత ఇంకో దివాణం దాటి నడిచి పోతూఉంటే వ్యాయామంచేసినంత పని అయింది. చాంగ్ వీరిని ఎన్నో గదులలోకి తీసుకుపోలేదు, అయినప్పటికీ వారు చూసినదే ఎంతో అద్భుతంగా ఉంది. ఈ బౌద్ధ సన్యాసులు అపారధనికులన్న సంకోచం ఆరామం పర్యటిస్తుంటే మరింత బలపడింది. ఈ ఆరామంలో గల కళాఖండాలూ, శిల్పఖండాలూ అమ్మితే పాశ్చాత్య దేశాల వారు ఆత్రంగా కొనటమేగాక అంతులేని డబ్బు కుమ్మరిస్తారని విక్రం తెలుసుకోగలిగాడు. సుంగ్‌యుగానికి చెందిన కూజాలూ, పిడతలూ, పింగాణీలూ, వెయ్యి సంవత్సరాల నాటి రంగులు ఇంకా చెక్కుచెదరకుండా ఉన్నాయి. ఈ అమూల్యమైన కళాఖండాలు ప్రేక్షకుణ్ణి దిగ్భ్రాంతుణ్ణి చెయ్యటానికిగాని, ప్రదర్శనార్థం కాని కాక, ఆ వాతావరణంతో చేరిపోయి మనసుకు శాంతియుతమైన ఆహ్లాదాన్ని కలిగించేవిగా ఉన్నాయి.

ఒకచోట అతిథులు పెద్ద గ్రంథాలయం చూశారు. ఇక్కడ అనేక ప్రపంచభాషలకు చెందిన సారస్వతమూ, ప్రాచ్యదేశాల ప్రాచీన గ్రంథాలూ విక్రంకు కనిపించాయి. ఇందులో కనీసం ఒక భాగం అపూర్వ గ్రంథాలై ఉంటాయని విక్రం భావించాడు.

విక్రం పుస్తకాలను పరిశీలిస్తుంటే అభయంకర్ దేశపటాలుగల పుస్తకం ఒకటి పట్టి విక్రంకిచ్చాడు.

"అన్నిటికన్న మనం జాగ్రత్తగా పఠించదగిన గ్రంథం", అన్నాడు అభయంకర్.

"మీకా పుస్తకం ఉపయోగిస్తుందనుకోను. ఎందుకంటే అందులో షాంగ్రిలా గుర్తుపెట్టి ఉండదు," అన్నాడు చాంగ్.

"కారణమేమిటి?" అన్నాడు విక్రం.

"మంచి కారణమేఉన్నది. కాని నే నంతకంటె ఏమీ చెప్పలేను,"

మరో బ్రహ్మరహస్యం!


"మేమింతవరకు మీ బౌద్ధ సన్యాసుల దినచర్య చూడలేదే?" అన్నది శోభారాణి.

"ఆశ్రమస్వీకారం చేయనివారు బౌద్ధ సన్యాసులను సందర్శించటం అసంభవం—కనీసం చాలా అరుదు," అన్నాడు చాంగ్.

"పోనీ వారేంపని చేస్తారు?" అన్నదామె.

"వారు తమ కాలాన్ని తపస్సులోనూ జ్ఞానసేకరణలోనూ గడుపుతారు."

"రాజు—పేద"లో రేలంగి



"అదికూడా ఒక పనేనా ?"

"అలాగయితే వారేమీ పని చెయ్యరు," అన్నాడు చాంగ్.

"ఇదంతా చూడడానికి ఇంపుగానే ఉందిగాని ఇటువంటి చోట నాకు నిరర్థకంగా కనిపిస్తుంది. ఏదైనా గిట్టుబాటుగా ఉంటేనేగాని నాకు నచ్చదు," అన్నది శోభారాణి.

"అయితే టీ తాగుదామా ?" అన్నాడు చాంగ్.

చాంగ్ వెటకారంగా అనలేదు. విక్రం గడియారం చూసి అప్పుడే టీకి టైమైనందుకు ఆశ్చర్యపడ్డాడు. చాంగ్ అందరినీ ఒకచోటికి తీసుకుపోయాడు. వారు కొన్ని మెట్లు దిగి ఒక మనోహరమైన ఉద్యానవనం ప్రవేశించారు. ఈ ఉద్యానవనంమధ్య ఒక కలువల కొలనున్నది. చూడగానే అది కొలనన్నదికూడా స్ఫురించదు. ఏమంటే ఎక్కడా నీరు కనిపించకుండా ఆకుపచ్చని ఆకులు అల్లుకుని ఉన్నాయి.

"ఎంత అందమైనచోటు!" అన్నాడు షేక్ సాయిబు.

అందరూ ఒక మండపంలో ప్రవేశించారు. అక్కడ ఒక పక్కగా వీణ ఒకటి ఉన్నది. దీనిని చూచి విక్రం ఆశ్చర్యపడ్డాడు. అతను పూర్వం దక్షిణదేశంలో ఉన్నప్పుడు వీణ వాయింపు కర్నాటక విద్వాంసులు వాయించగా విన్నాడు. అతనికా వాద్యంమీద చాలా గౌరవంకూడాఉంది. కాని ఆ వాద్యం ఇక్కడ కనిపించటం అతనికి వింతగా ఉంది.

చాంగ్ అతని ప్రశ్నలకు కొంతవరకు సమాధానాలు చెప్పాడు. ఇక్కడి బౌద్ధసన్యాసులు సంగీతాన్ని ఆదరిస్తారనీ, కర్నాటక సంగీతమూ ప్రత్యేకించి త్యాగరాజు రచనలూ వారికిష్టమనీ చాంగ్ చెప్పాడు. వీరు మాట్లాడు కుంటూండగానే నౌకర్లు పింగాణీ గిన్నెలలో సువాసనగల టీ తెచ్చారు. వారివెంట ఒక స్త్రీ కూడా వచ్చింది. ఈమె చీనా స్త్రీలాగా దుస్తులు ధరించింది. ఈమె నేరుగా వీణ వద్దకు పోయి దానిమీద ఒక రాగం ఆలాపనచేయసాగింది. ఈ రాగాన్ని "కర్నాటకీ" అనే పేరుతో మహారాష్ట్రి

తోడుదొంగలు ఊళ్ళుపంచుకోవటంలో తగాదాపడతారు. సారధీవారి "అంతా మనవాళ్లే"లో సి. ఎస్. ఆర్., రంగారావు



గాయకులు పిలుస్తారని విక్రంకు జ్ఞాపకంవచ్చింది. కాని ఖాన్‌సాహెబ్ అబ్దుల్ కరీంఖాన్ దీనినే మరోపేరుతో పాడినట్టు అతనికి గుర్తు. ఆ పేరుమటుకు స్ఫురణకు రాలేదు. అతను వీణ వాయించే స్త్రీని గమనించాడు. ఆమె చాలా చిన్నసైజుమనిషి. కాని అవయవాల పొందిక నిండుగానే వున్నది. కోసగల ముక్కూ, ఎత్తయిన దవడ ఎముకలూ, కోడిగుడ్డురంగు శరీరమూచూస్తే చీనాబొమ్మలాగా ఉంది. జుట్టు నున్నగా దువ్వి వెనుక జడవేసుకుంది. ఆలాపన అయిన తరువాత అదే రాగంలో కాస్సేపు పాట వాయించి లేచి వెళ్లిపోయింది.

"ఆమె ఎవరు?" అని అభయంకర్ చాంగ్‌ను అడిగాడు.

"ఆమెపేరు లోత్సెన్. వీణవాయించడంలో మంచి నేర్పరి. నాలాగే ఈమెకూడా సన్యాసానికి సాధకం చేస్తోంది."

"అప్పుడేనా ? ఆమె చూస్తే పసిపిల్లలాగుంది ? మీలో సన్యాసినులుకూడా ఉంటారా ?" అన్నది శోభారాణి.

"మాలో ఆడ మగ తారతమ్యాలు లేవు."

"ఇక్కడ ఆడవాళ్ళున్నారని తెలిశాక ఈ చోటుకు కొంత అందంవచ్చినట్టుగా కనిపిస్తోంది. ఈ పిల్లకు ఎన్నేళ్ళుంటాయి ?" అని అడిగాడు షేక్‌మహమ్మదాలీ.

"నేను చెప్పటానికి వీల్లేదు," అన్నాడు చాంగ్.

"అవునవును, ఆడపిల్లల వయసు బయటపెట్టడం ఆధునిక సంప్రదాయంకాదు," అంటూ మహమ్మదాలీ నవ్వాడు.

ఆ రాత్రి భోజనాల అనంతరం విక్రం ఒంటరిగా వరండాలోకి వెళ్ళాడు. వెన్నెల పిండారబోసినట్టున్నది. ఈ వెన్నెట్లో షాంగ్రిలా చాలా అందంగా ఉన్నది. ఎదురుగా కారకాల్ హిమశృంగం చాలా సమీపంలో ఉన్నట్టుగా కనిపిస్తోంది. జరిగిన సంఘటనలన్నీ మననంచేసుకుంటూ, వాటివెనక ఉన్న రహస్యాన్ని అర్థంచేసుకోవటానికి యత్నిస్తూ అతను నడవలవెంబడి నడవసాగాడు. చిట్టచివరకు అతను ఒక డాబామీదికి వచ్చాడు. దానిపక్కనే

"రాజు—పేద" పాట రికార్డుచేస్తున్న జిక్కి. ఫొటోలో వాహినీ రికార్డిస్టు కృష్ణన్‌గారూ, నిర్మాత బి. ఏ. సుబ్బారావుగారూ, సంగీత దర్శకుడు రాజేశ్వరరావుగారూ తదితరులూ వున్నారు



లోయ, అతను పిట్టగోడమీదినుంచి లోయలోకి తొంగి చూశాడు. అతని కళ్ళు తిరిగిపోయాయి. లోయ ఒకమైలు లోతున్నట్టు కనబడింది. లోయలోకి దిగి అక్కడి ప్రజలనూ, వారి జీవితాన్నీ చూడడానికి అనుమతి దొరుకుతుందా అని ఆలోచించాడు. ఈ లోయలో మానవ ప్రపంచానికి తెలియకుండా దాగిఉన్న ఈ సమాజమూ, దీనిపై పెత్తనంచేసే బౌద్ధసన్యాసులూ తలుచుకుంటే అతనికి ఆశ్చర్యంవేసింది.

లోయలోనుంచి ఏవో శబ్దాలు పైకి తేలివచ్చాయి. జాగ్రత్తగా వింటే జే గంటల చప్పుడూ, బాకాలమోతా, రోదన ధ్వనులూ వినిపించాయి. ఇవి గాలి మారినప్పుడల్లా మాసిపోతూ, మళ్ళీ వినిపిస్తూరాసాగాయి. ఈ ధ్వనులకూ, తనచుట్టూ నిశ్చలంగా, నిర్జనంలాగా, ప్రశాంతంగా ఉన్న షాంగ్రిలా ఆశ్రమానికీ విక్రం మనసులో సామరస్యం కుదరలేదు. ఇంతలో డాబాకు ఎగువను ఉన్న కిటికీలోనుంచి ఒక పచ్చని దీపపుకాంతి బయటికి ప్రసరించింది. విక్రం తల ఎత్తిచూసి, బౌద్ధసన్యాసులు అక్కడ ఉంటారేమోననుకున్నాడు.

ఈ సమయంలో ఇద్దరు టిబెటనులు డాబామీదికి వచ్చి పిట్టగోడపక్కగా నిలబడ్డారు. వారిద్దరూ ఈ విధంగా మాట్లాడుకోసాగారు. వారి భాష విక్రంకు కొంతవరకు మాత్రమే అర్థమయింది.

"టాలూను పాతిపెట్టారు."

"షాంగ్రిలా పెద్దల ఆజ్ఞ శిరసావహించాడు."

"అతను అవతల మరణించాడు."


"పెద్ద పక్షిమీద పెద్ద కొండలుదాటి గాలిలోవచ్చాడు."

"కొత్తవారిని తెచ్చాడు."

"బయటిగాలికీ, బయటిచలికీ టాలూ జంకలేదు."

"అతను చాలాకాలమై బయటే ఉండినా చంద్రలోయ అతన్ని మరవలేదు."

వారి సంభాషణలో మిగిలినది విక్రంకు అర్థంకాలేదు. కాని ఈ విన్నదేచాలు అతనికి. తమను తస్కరించి



"రాజు–పేద" సెట్టుమీద వర్కింగ్‌స్టిల్. కామెరావద్ద ఆదీ ఎం. ఇరానీ, కుడివైపున బల్లవెనక మేకప్‌లో సుధాకర్

తెచ్చినవాడు ఉన్మాదికాడు. షాంగ్రిలా ఆదేశానుసారం తాము ఇక్కడికి చేర్చబడ్డారు. కాని దేనికి ?


ఈ ప్రశ్నకు సమాధానం దొరకలేదు. ఎవరో, ఏదో పనిపెట్టుకుని తమను ఇక్కడికి రప్పించారు. తమరాక యాదృచ్ఛికంకాదు. దానికొక పరమార్థమున్నది. ఈ ఆలోచన విక్రంకు ఉత్సాహాన్నే ఇచ్చింది. అతనీ రహస్యాన్ని తనవారితో చెప్పరాదనుకున్నాడు.

రోజులు గడిచిపోతున్నాయి. జీవితం అనుకున్నంత దుర్భరంగాలేదు. చాంగ్ తన అతిథుల కాలయాపనకుగాను ఏవేవో కార్యక్రమాలు కల్పించేవాడు. ఈ ఆగంతకులు నలుగురూ షాంగ్రిలాను గురించి తెలుసుకోవడమేగాక ఒకరినిగురించి ఒకరు తెలుసుకోసాగారు.

ఒకనాడు అందరూ కలిసి డోలీలలో లోయలోకి దిగారు. ఆదారిన డోలీలవాళ్ళు దిగవలిసిందేగాని అనుభవం లేనివారు దిగటం దాదాపు అసంభవం. డోలీలోకూర్చున్న వారికే ఒక్కొక్కప్పుడు చాలా భయంవేసేది. ఈలోయ నిడివి సుమారు పన్నెండు మైళ్ళుంటుంది, వెడల్పు అంతటా ఒకటిగాలేదు. కొన్నిచోట్ల అయిదు మైళ్ళ వెడల్పుంటే కొన్నిచోట్ల మైలుమాత్రమే ఉంది విశేష మేమంటే ఈలోయ అతి సారవంతమైనది. ఇక్కడ అనేక రకాల పంటలు, అనేక ఉష్ణపరిమాణాలలో మాత్రమే సాగుకాదగినవి, పండుతున్నాయి. లోయచుట్టూ ఉన్న కొండలమీది మంచు కరిగి సన్నని కాలవలుగా లోయలోకి దిగి ఈ పంటలు పండిస్తోంది. ఈవిధంగా కొద్ది కాలవలు మాత్రమే దిగక పెద్దపెద్ద మంచుగుట్టలు లోయలోకి విరిగిపడి కాలక్రమాన ఈ లోయయావత్తూ మైలులోతు సరస్సుకావడానికి అభ్యంతరమేమిటో విక్రంకు అర్థంకాలేదు. అలా జరక్కపోవడం కేవలం ఈ చంద్ర లోయవాసుల అదృష్టమనుకున్నాడు.

లోయలోని ప్రజలు ఆరోగ్యంగా, ఉల్లాసంగా, అందంగాకూడా కనిపించారు. ఈ కొత్త మొహాలను చూసి వారు చిరునవ్వులు నవ్వారేగాని అనుమానంగా వారికేసి

"అంతా మనవాళ్ళే"లో రమణారెడ్డి, వి. నరసింహారావు, హేమలత



చూడలేదు. అందరూ ఏవో పనులలో నిమగ్నులై ఉన్నట్టే కనిపించారుగాని ఎవరూ నడుములు విరిగే పని చేస్తున్నట్టు కనబడలేదు. వారిలో అవినయంగాని మనఃక్లేశం కలిగించే ఇతర అవలక్షణాలుగాని లేవు. ఇంత అదృష్టవంతమైన సమాజాన్ని తాను ఎక్కడా చూడలేదని విక్రంకు తోచింది. "పైచూపులకు" ఇక్కడివారి జీవితం బాగానే ఉన్నదని శోభారాణికూడా ఒప్పుకున్నది.

ఈ లోయలో వారు బౌద్ధ ఆలయాలు చూశారు. వీటికి ప్రత్యేకంగా అర్చకులున్నారని చాంగ్ చెప్పాడు. ఇంకా ఇతర మతాలవారి ఆలయాలుకూడా ఉన్నాయని ఆయన అన్నాడు.

"సానపట్టిన వజ్రానికి అనేక పలకలుంటాయి. చాలా మతాలు చాలావరకు నిజమైనవనే చెప్పొచ్చు," అన్నాడు చాంగ్.

ఈ లోయలోని జీవితాన్నిగురించి చాంగ్ ఏమీ దాచలేదు. ఇక్కడి పరిపాలన విక్రంకు విచిత్రంగా కనిపించింది. షాంగ్రిలా అధికారుల నిరంకుశ పరిపాలనే ఇక్కడ అమలు జరుగుతున్నది. అయితే అందులో కర్కశత్వం ఏమీ కనపడలేదు. అది విజయవంతంగా సాగుతున్నట్లు కూడా కనబడింది. ఎందుకంటే ఇక్కడ సైనికులూ, పోలీసులూ లేరు. నేరస్థుల మాటేమిటంటే, ఇక్కడ నేరాలు సాధారణంగా జరగవని చాంగ్ చెప్పాడు. ప్రతి స్వల్పవిషయాన్నీ నేరంగా భావించరు. మనుషుల నిత్యావసరాలు హాయిగా జరిగిపోతాయి. లోటులేని జీవితాలు. పైన ప్రజలకు చిన్నతనంనుంచీ సత్ప్రవర్తన అలవరుస్తారు. సమాజవిరుద్ధమైన పనులు చేయడం తప్పుగా పరిగణించబడుతుంది. అట్టిపనులు చేసినవాడు "వెలి"గా చూడబడతాడు.

ఆడవాళ్ళను గురించి తగాదాలు రావా. అని విక్రం అడిగాడు.

"చాలా అరుదు," అన్నాడు చాంగ్. "ఒకడు కోరే స్త్రీని ఇంకొకడు కోరటం మర్యాదకాదు."

"కాని రెండోవాడికి మర్యాదను పాటించలేనంత కాంక్ష ఉంటేనో?"

"అప్పుడు మొదటివాడే తగ్గుతాడు. తగ్గడం వాడికి మర్యాద. ఆడదికూడా పరిస్థితికి అనుగుణంగా ప్రవర్తిస్తుంది. నలుగురూ సద్బుద్ధి కనబరిస్తే, మీ జాతీయనాయకుడు చెప్పినట్టు, పరిష్కరించరాని సమస్య అంటూ ఉండనవసరంలేదు," అన్నాడు చాంగ్.

విక్రం తన కాలాన్ని ఎక్కువగా గ్రంథాలయంలోనూ, గానమందిరంలోనూ గడిపేవాడు. పుస్తకాలు చూస్తున్న కొద్దీ ఇక్కడి బౌద్ధసన్యాసుల విజ్ఞానం గురించి అతనికి గొప్ప అభిప్రాయం కలగసాగింది. కాని అతనికి ఒకటి కనిపించింది. ఇక్కడ పత్రికలుగాని, పుస్తకాలుగాని సరికొత్తవి ఉన్నట్టులేదు.


"కిందటి మారు పుస్తకాలు తెప్పించి ఎంతకాలమైంది?" అని అతను చాంగ్‌ను అడిగాడు.

"1939లో తెప్పించాం" అన్నాడు చాంగ్.

"అయితే మీ ప్రపంచవిజ్ఞానం చాలా వెనుకపడిఉన్నదన్నమాట. ఈ మధ్యకాలంలో ఎంత విచిత్ర పరిణామాలు జరిగినవీ మీకు తెలియదు."

"అది పొరపాటు. ఈ పరిణామాలు 1939లో ఊహించినవే. 1950 కి మరింత బాగా అర్థమవుతాయి కూడాను. తొందర ఏమీలేదు."

"అంతా మనవాళ్లే"లో అభ్యుదయజంటగా
నరసింహారావు, కృష్ణకుమారి



చాంగ్ తత్వం తనకు అర్థమవుతున్నదని విక్రంకు అనిపించింది. పొద్దుటి పత్రికా సాయంకాలం పత్రికాకూడా చదివేవారున్నారు. వారికి ప్రపంచం అర్థమవుతున్నదని ఎక్కడుంది?

"క్రిందటిమారు మీకు అతిథులు వచ్చిన దెప్పుడు?" అని అడిగాడు విక్రం.

"ఆ ప్రశ్నకు నేను సమాధానం చెప్పలేను" అన్నాడు చాంగ్. అంతటితో ఆ సంభాషణ ముగిసింది. సామాన్యంగా చాంగ్‌తోచేసే ప్రతి సంభాషణకూ ఇదేముగింపు.

గానమందిరంలో అతనికి చీనాపిల్లకూడా తరుచు కనిపించేది. కాని చాంగ్‌లాగా ఆమెకు హిందీరాదు. తాను చీనాభాష మాట్లాడగలడుకాని, విక్రం ఈ విషయం ఇంత వరకు రహస్యంగా ఉంచుతూవచ్చాడు. ఇప్పుడది బయట పెట్టడం అతనికిష్టంలేదు. ఆమె ప్రవర్తనలాగే ఆమె వాద్యంకూడా ముచ్చటగా, నిర్దుష్టంగా ఉండేది. ఆమె వయసు ముప్ఫై దాటదనిపించేదిగాని స్పష్టంగా ఇంత అని తెలిసేదికాదు.

మధ్యమధ్య అభయంకర్ కూడా సంగీతం వినటానికి వచ్చి ఆ పిల్లను చూసేవాడు.

"ఈ అమ్మాయి ఇక్కడేంచేస్తున్నదో నాకర్థంకావడం లేదు" అన్నాడతను ఒకసారి విక్రంతో. "ఈ సన్యాసుల ఆశ్రమంలో చాంగ్‌లాటి ముసిలాళ్ళుండటం బాగానేఉంది గాని ఈమె దేనికి? ఈమె ఎంతకాలన్నై ఇక్కడుందో?"

"మనకెవరూ చెప్పరు" అన్నాడు విక్రం.

"ఈమె ఇక్కడ ఇష్టపడే ఉంటున్న దంటావా?"

"అయిష్టంగా ఉంటున్నట్టు మాత్రం లేదు."

"ఆమెలో అసలే భావాలూ ఉన్నట్టులేదు. చీనాబొమ్మ."

"అయితే తప్పేం! మన నవనాగరిక యువతుల్లాగా

అక్టోబరు 24 న భారత ఉపాధ్యక్షులు రాధాకృష్ణగారు సపరివారంగా వాహినీ స్టూడియోకు వచ్చారు. ఆ సందర్భంలో అల్పాహారవిందు జరిగింది



గట్టిగా వికవికలాడుతూ, గబగబా ఊపుతూ నడిస్తే అందులో ఆడతనం ఎక్కువుందా? ఈ చీనాబొమ్మకు అందం ఉంది, మర్యాద ఉంది, వీణవాయించటం చాతనవును. హాకీ ఆడేదానిలాగా నడవదు,'' అన్నాడు విక్రం.

శోభారాణికి టిబెట్టు భాష నేర్చుకోవాలని పుట్టింది. చాంగ్ ఆమెకొరకు కొన్ని పుస్తకాలు తీసి ఇచ్చాడు. ఆమె తనకాలం చాలావరకు ఆభాష నేర్చుకోవడంలో గడపసాగింది.


ఒక్క షేక్ మహమ్మదాలీ విషయంమటుకు అయోమయంగా ఉండిపోయింది. అతను ఎవరో, అతని చరిత్ర ఏమిటో విక్రంకుగాని, అభయంకర్‌కుగాని తెలీదు. అతని నిశ్చింతా, ఉల్లాసమూ, యీ అనుభవంగురించి అతని వైఖరీకూడా అతి విచిత్రంగా ఉన్నాయి. ఈ సమయంలో అభయంకర్ అతన్నిగురించి కొంత తెలుసుకోవడం శల వని తలంపుగా జరిగింది.


షేక్ మహమ్మదాలీ తన సంచీని ఎక్కడో జారవిడిస్తే అది అభయంకర్‌దనే అపోహతో చాంగ్ దాన్ని అభయంకర్‌కు ఇచ్చాడు. అభయంకర్ దాన్ని తెరిచి చూసేసరికి అందులోనుంచి కొన్ని పత్రికల కటింగులు జారి కిందపడ్డాయి. అభయంకర్ వాటిని చదివాడు. ఆ సంచీలోనే షేక్ మహమ్మదాలీ తాలూకు కాగితాలుకూడా ఉన్నాయి. వాటినికూడా అభయంకర్ చూశాడు.

తరువాత విక్రం ఏకాంతంగా దొరకగానే అభయంకర్ తానుచూసిన విషయాలు అతనితో చేప్పేశాడు.

"ఈ షేక్ మహమ్మదాలీ ఎవరనుకున్నావు? ఇతను పేరుమార్చుకు తిరుగుతున్న గొప్ప వంచకుడు. సింధు హైద్రాబాద్‌లో పెద్దవర్తకులను దగాచేసి రెండు మూడు లక్షలు అపహరించాడు. నూనెవర్తకుడల్లే నటించి ఇరానులో కూడా చాలా డబ్బు హరించాడు. మనం కరాచీనుండి రేపు బయలుదేరుతామనగా డాన్ పత్రికలో ఇతని ఫొటోకూడా

రాధాకృష్ణగారు, వారి పరివారమూ "మల్లీశ్వరి" చిత్రాన్ని చూచారు.
ముందున్నవారు రాధాకృష్ణ, బి. ఎన్. రెడ్డి, బి. నాగిరెడ్డిగార్లు.





"అంతా మనవాళ్ళే"లో కృష్ణకుమారి,
నరసింహారావు, లక్ష్మీపెరుమాళ్ళు

పడింది. ఇతను పరారీ. వంచకుడు. నాలుగుదేశాల పోలీసులు ఇతనికోసం వెతుకుతున్నారు," అన్నాడు అభయంకర్.

"అందుకనే అతనికిక్కడ కొంతకాలం గడపడానికి అభ్యంతరం లేదు!" అన్నాడు విక్రం. "తనపేరు చచ్చిపోయినవారి జాబితాలో పడుతుందన్నప్పుడుకూడా అతను ఫరవాలేదనటానికిదే కారణమై ఉంటుంది."

ఈవిధంగా షేక్ మహమ్మదాలీ ప్రవర్తనను అర్థంచేసుకోవడంతప్ప విక్రం ఇంకేమీ అందోళన కనబరచనందుకు అభయంకర్ చిరాకుపడ్డాడు.

"ఇప్పుడు మనం ఏంచెయ్యాలో ఆలోచించు. మనం బాధ్యతగల ప్రభుత్వోద్యోగులం, ఈ సంఘవిరోధిని అరెస్టు చెయ్యవలసిన బాధ్యత మనమీదఉంది. ఇతని ఆచోకీ తెలిసికూడా మనం ఏమీ ఎరుగనట్టు-అతను మనసాటివాడైనట్టు-ఎలా వ్యవహరించగలం?" అన్నాడు అభయంకర్.

విక్రం చలించలేదు.

"నామీద ఏ బాధ్యతాలేదు. నువు చెప్పినదంతా నిజమే అయినా అదిరుజువుచేసే భారం నాపైన వేసుకోను, ఆపని మరెవరినన్నా చెయ్యనీ. నాకు సంబంధించినంతవరకు మనం ఇక్కడినుండి వెళ్ళేదాకా అతను మనసాటివాడే. అతనిమీద అభియోగాలుతెచ్చి యీ చోటుగానిచోట వికృత పరిస్థితి తెచ్చిపెట్టడం నాకెంతమాత్రం ఇష్టంలేదు, నా సలహా కావాలంటే నువుకూడా ఇక్కడున్న నాలుగు రోజులూ ఏమీ తెలియనట్టు ఊరుకో!"

ఆ రాత్రి భోజనాల అనంతరం చాంగ్ వెళ్ళిపోయాడు. శోభారాణి టిబెట్ వ్యాకరణం పట్టుకున్నది. ముగ్గురు మగవాళ్ళూ భోజనాల బల్లలవద్ద కాఫీతాగుతూ చుట్టలు కాలుస్తూ కూచున్నారు.

అంతవరకూ పరధ్యానంగా కూర్చున్న షేక్ మహమ్మదాలీ అకస్మాత్తుగా, "నేనెవరో మీకు తెలుసుననుకుంటాను" అన్నాడు.

అభయంకర్ ముఖం జేవురించింది. విక్రం మటుకు తొణకకుండా, "మాకిద్దరికీ తెలుసు" అన్నాడు.

"నా అజాగ్రత్తే కారణం. ఆ సంచీ పోగొట్టుకోవలసిందికాదు" అన్నాడు మహమ్మదాలీ.

"అందరం పొరపాట్లుచేస్తాం" అన్నాడు విక్రం.

"మీరిద్దరూ గుంభనగా ఉన్నారు, నా అదృష్టం. చాలా కృతజ్ఞుణ్ణి." మహమ్మదాలీ గట్టిగా నవ్వాడు. "భారీ వ్యాపారమంటే ఏమిటో మీకు తెలిసిఉండదు. మామూలు వ్యాపారస్తుడు నేరస్తుడుకావడం ఎంత సులువో నేను చెబుతాను. అందరు వ్యాపారస్తులూ చేస్తున్నట్టే నువుకూడా చవకలో కొంటావు, ధరలు పెరగటంకోసం ఎదురుచూస్తూ ఉంటావు. కాని ఆ ధరలు పెరగవు. ఈలోగా ఏ ఇరానులోనో ఏదో చిన్నగల్లంతు జరుగుతుంది. ఏ రాజకీయ నాయకుడో మజ్లీస్‌లో ఏదో అంటాడు. ధరలు కిందికి దొర్లుకుంటూవస్తాయి. నువు లోకులకు ఏ పాతిక లక్షలో ఇవ్వదేలుతావు—నీ లక్షలు పోవడంమాట అటుంచి, నీకోసం పోలీసులు వస్తారు. నువు వారికోసం ఎదురు చూడడంతప్ప ఇంకేమీలేను. నేను పోలీసులకోసం ఎదురు చూడలేను, దేశంవిడిచి పారిపోయాను. ఇటువంటి భారీ వ్యాపారంమీద సంఘశ్రేయస్సు ఆధారపడడం శోచనీయమంటాను."

"నీవంతా కేవలం దురదృష్టమేనా? ఇతరుల డబ్బు కాజెయ్యలేదా?" అన్నాడు అభయంకర్.

"వాళ్ళుకూడా ఉట్టుడియంగా డబ్బు రావాలని ఆశ

[మిగతా 56 వ పేజీలో]

[ 40 వ పేజీ తరువాయి ]

పడ్డవాళ్ళే. స్వయంగా చేసుకోలేక నన్ను ఉపయోగించుకో జూశారు.''

"అబద్ధం. వాళ్ళు నిన్ను విశ్వసించారు. నీదగ్గిర వాళ్ళ డబ్బు క్షేమంగా ఉంటుందనుకున్నారు. నువు వాళ్ళని వంచించావు ?''

"డబ్బుకు క్షేమం ఎక్కడుంది? ఉండడానికి వీలేలేదు. తుఫానులో గొడుగు ఏం క్షేమం ?''

"తుఫానుకు నీ జవాబుదారీలేదని ఒప్పుకుంటాం.'' అన్నాడు విక్రం.

"నేను జవాబుదారీగా ఉండడానిక్కూడా యత్నం చెయ్యలేదు. మనం ఇక్కడ వచ్చిపడ్డాం, దీనికి మనమెట్లా జవాబుదారీ ?''

మహమ్మదాలీ ఆర్థికసంక్షోభం ఇప్పుడు విక్రంకు పట్ట లేదు.రాజకీయంగాకూడా ఢిల్లీలో,లండన్‌లో,వాషింగ్టన్‌లో జరిగే రాజకీయ తంత్రాంగాలూ, యుద్ధయత్నాలూ, సామ్రాజ్యవిస్తరణ యత్నాలూ యీ జాతికి చెందినవే. అయితే వీటిలో పాల్గొనేవాళ్ళవెంట పోలీసులు పడరు. ఇప్పుడు. యీ షాంగ్రిలా వాతావరణానికి అవన్నీ దూరంగా, అవాస్తవంగా ఉన్నాయి.

షాంగ్రిలా శాంతియుత వాతావరణం విక్రంను ఆవహించింది. అతను బయటికివచ్చాడు. చంద్రుడులేని నీలాకాశంలో తారలు మిలమిలలాడుతున్నాయి. కారకాల్ మంచుగోపురం నీలంగా కనిపిస్తోంది. ఈ క్షణాన పోర్టర్లు వచ్చి అతన్ని తిరుగుప్రయాణం చేయమంటే అతను ఉత్సాహం ప్రకటించలేడు. తన తిరుగుప్రయాణం ఊహించాడు. పోర్టర్లు రావటమూ తాము బయలుదేరి నానా అగచాట్లూపడి కొండలన్నీదాటి ఏ సికింలోనో ఏ తేయాకు తోట యజమాని గృహంలోనో దిగి ఆతిథ్యం తీసుకోవటమూ, ఆక్షణాన కలగదగినంత ఆనందం కలగక పోవటమూ—

ఆకస్మికంగా అతని ఆలోచన భగ్నమయింది. చాంగ్ అతని సమీపానికి వచ్చి,'' అయ్యా. తమకొక శుభవార్త అందించడానికి గర్విస్తున్నాను !'' అన్నాడు.

[సశేషం]

[ 47 వ పేజీ తరువాయి ]

డి. లక్ష్మీరాజ్యం, నిజామాబాద్

ఎ. నాగేశ్వరరావు ఇప్పుడు ఏ ఏ పిక్చర్లలో నటిస్తున్నాడు ?

గోకుల్‌కృష్ణావారి "నిరుపేదలు", ఎ. వి. ఎం. వారి "వదినె" చిత్రాలలో ప్రస్తుతం నటిస్తున్నాడు. అశ్వరాజ్‌వారి "అన్నదాత", అన్నపూర్ణావారి "దొంగరాముడు" మొదలైన చిత్రాలలో నటించనున్నాడు.

వేదాంతం రాఘవయ్యగారిప్పుడు తీసే చిత్రం పేరేమిటి? హీరో, హీరోయిన్ ఎవరు ?

"అన్నదాత;" ఎ. నాగేశ్వరరావు, అంజలీదేవి.

ఘంటసాల బలరామయ్యగారు తీసే చిత్రం పేరేమిటి ?

జానపద చిత్రం. ఇంకా పేరుపెట్టలేదు.

హీరో, హీరోయిన్ ఎవరు ?

ఎన్. టి. రామారావు, అంజలీదేవి.

ఆర్. సంగమునాయుడు, కోమట్లపేట

అంజలి, ఎన్. టి. రామారావు నటించిన చిత్రము ఏదైన ఉందా ?

బి. ఏ. సుబ్బారావుగారి "పల్లెటూరిపిల్ల"లో ఇద్దరూ నటించారు. ప్రస్తుతం ఎ. వి. ఎం. వారి "పిల్ల" లోనూ, ప్రతిభావారు ఇటీవల ప్రారంభించిన కొత్త చిత్రంలోనూకూడా వీరిద్దరూ కలిసి నటిస్తున్నారు.

నాగిరెడ్డి, చక్రపాణి ఇద్దరు అన్నదమ్ములేనా ?

చిత్రనిర్మాణంలో మాత్రమే.

డైరెక్టరు కామేశ్వరరావుగారు ఇదివరకే చిత్రాన్నయినా డైరెక్టు చేశారా ?

లేదు. కాని కొన్ని వాహినీ చిత్రాలకు అసోసియేట్ డైరెక్టరుగా పనిచేశారు.

ముక్కామల ఏ పిక్చరులో నటిస్తున్నాడు ?

"పల్లెపడుచు", "విషబిందువు" చిత్రాలలో నటిస్తున్నాడు.

ఘంటసాల వెంకటేశ్వరరావు ఏ చిత్రములోనైన నటించాడా ?

చెప్పుకోదగిన పాత్ర ఏదీ నటించలేదు. కాని సినిమారంగంలోకి వస్తూనే ప్రతిభావారి "శ్రీరామ జననం"లో చిల్లర వేషాలు వేశాడు. ★

Printed by B. NAGI REDDI at the B. N. K. Press Ltd, Madras 26, and Published by him for Chandamama Publications, Madras 26. Controlling Editor : SRI " CHAKRAPANI "